క్లుప్తంగా

నేడు నగరిలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

చిత్తూరు కలెక్టరేట్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 10 న నగరి లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నగరి ఎంపీడీఓ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కార్యక్రమం జరుగుతుందని వెల్లడించారు. నియోజకవర్గంలో ప్రజలు తమ సమస్యలను వినతుల రూపంలో అందజేసి పరిష్కరించుకోవాలన్నారు. నియోజకవర్గం లోని అధికారులు కార్యక్రమానికి తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. గైర్హాజరైతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఆర్డీఓ కార్యాలయం డీఏఓగా మోహనవల్లి



చిత్తూరు కలెక్టరేట్: చిత్తూరు ఆర్డీఓ కార్యాలయం డీఏఓ (డివిజన్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్)గా మోహనవల్లి నియమితులయ్యారు. ఆమె బుధవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. గతంలో పాలసముద్రం, తవణంపల్లి మండలాల్లో తహసీల్దార్‌గా విధులు నిర్వర్తించారు. ఆమె మాట్లాడుతూ రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం తనవంతు కృషి చేస్తానన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలను ఎప్పటికప్పుడు పాటిస్తానని తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం కార్యాలయానికి వచ్చే ప్రజలకు న్యాయం చేస్తానని వెల్లడించారు.

వీఆర్‌ఏల నూతన కార్యవర్గం



బంగారుపాళెం: నూతనంగా ఎన్నికైన మండల వీఆర్‌ఏల కార్యవర్గం

బంగారుపాళెం: విలేజ్ రెవెన్యూ అసిస్టెంట్లు(వీఆర్‌ఏ) మండల నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో మండల వీఆర్‌ఏల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జిల్లా అధ్యక్షుడు కోదండన్, గౌరవ అధ్యక్షుడు లక్ష్మణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీఆర్‌ఏల సమస్యలపై చర్చించారు. తమ న్యాయమైన సమస్యలను సాధించుకునేందుకు చేపటాల్సిన కార్యాచరణ గురించి మాట్లాడారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు కోదండన్ సమక్షంలో మండల వీఆర్‌ఏల నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా ఖాదర్‌బాషా, ప్రధాన కార్యదర్శిగా గోవిందస్వామి, ఉపాధ్యక్షులుగా ప్రభాకర్, కోశాధికారిగా జీవరత్నం, కార్యదర్శిగా నాగరాజుతో పాటు సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పలువురు వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

ఫిర్యాదుల స్వీకరణ



సమస్యలను తెలుసుకుంటున్న డీఈ ప్రసాద్

చిత్తూరు కార్పొరేషన్: ట్రాన్స్‌కో అర్బన్ డివిజన్ కార్యాలయంలో బుధవారంలో విద్యుత్ గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో పలు ప్రాంతాల నుంచి బాధితులు సమస్యలను పరిష్కారించాలని విన్నవించారు. మొత్తం 5 సమస్యలు రాగా అందులో ఆర్థికపరమైనవి 2, ఆర్థికేతరమైనవి 3 సమస్యలు వచ్చినట్లు ఈఈ మునిచంద్ర తెలిపారు. ఆర్థికేతర పనులు నిర్వహించి ఆర్థిక అనుమతులు వచ్చాక మిగిలిన పనులు పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో డీఈ ప్రసాద్, ఆనంద్, ఏఈ మాధురి, రాజా తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు జాతీయస్థాయి పద్యాల పోటీలు

పలమనేరు: తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి 12వ వార్షికోత్సవం పురస్కరించుకుని విద్యార్థులకు జాతీయస్థాయిలో పద్యాల పోటీలు నిర్వహించనున్నట్లు ఆ సమితి అధ్యక్షులు తులసీనాథం నాయుడు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వందకుపైగా పద్యాలను చెప్పగలిగిన పిల్లలు ఈనెల 20వ తేదీ లోపు 9346249011 నంబరుకు కాల్ చేసి పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. ఇందులో ఎంపిక చేసిన 50 మందికి ఈ నెల 27న పలమనేరులో జరిగే వార్షికోత్సవంలో బహుమతులు ప్రదానం చేస్తామని తెలియజేశారు.

సిగ్గుచేటు..!

- సమస్యపై స్పందించని అధికారులు
- గుంతలు పూడ్చివేసిన ఓ సామాన్యుడు

పుంగనూరు: పట్టణంలోని ఎన్ఎస్.పేటకు వెళ్లే రహదారి గుంతలమయమైంది. అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా స్పందించకపోవడంతో ఆ ప్రాంతానికి చెందిన గోపాల్ అనే రైతు బుధవారం తన సొంత ఖర్చుతో ట్రాక్టర్ల ద్వారా స్టోన్ క్రషర్ రాతి దుమ్మును తరలించి, గుంతలు పూడ్చివేశారు. ఇందుకోసం పదివేల రూపాయల వరకు వ్యయం చేశాడు. ప్రభుత్వం చేయాల్సిన పనులు సామాన్య రైతు చేయడంతో ఆ ప్రాంత వాసులు, వివిధ సంఘాల నాయకులు అభినందించారు.

కొత్త ఈఆర్వో ఏర్పాటయ్యేనా..!

- సబ్‌డివిజన్ వినియోగదారులు స్థానికంగా సేవలు పొందే అవకాశం
- అదనపు కార్యాలయం ఏర్పాటుకు పరిశీలన
- విద్యుత్ సర్కిల్ కార్యాలయ అధికారుల ఆమోదంతో ఆశలు
- సుదూర ప్రాంత ప్రజలకు మేలు
- తగ్గనున్న ఉద్యోగులపై పనిభారం



చిత్తూరులోని ఈఆర్వో కార్యాలయం

చిత్తూరు కార్పొరేషన్: చిత్తూరులో విద్యుత్‌శాఖ సర్కిల్ (జిల్లా) కార్యాలయం ఏర్పాటుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఎస్ఈ కార్యాలయంతో పాటు ఎప్పటి నుంచో పెండింగ్‌లో ఉన్న ఎలక్ట్రిసిటీ రెవెన్యూ ఆఫీసు (ఈఆర్వో) ఏర్పాటు చేయాలని ఉద్యోగులు కోరుతున్నారు. వీటి వల్ల వినియోగదారులకు సేవలు సులభతరంగా మారి ఉద్యోగులపై పనిభారం తగ్గుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఎస్ఈ కార్యాలయంలో పాటు పలు అనుబంధ విభాగాల కార్యాలయాల ఏర్పాటుతో ఈఆర్వోను ఏర్పాటు చేస్తే మరింత మెరుగైన సేవలు అందించవచ్చని భావిస్తున్నారు.

నూతన కార్యాలయం అవసరం

డిస్కం (రాయలసీమ, నెల్లూరు జిల్లాల)లో ఒకే ఒక ఈఆర్వో కార్యాలయం ఉండేది కేవలం చిత్తూరు అర్బన్ డివిజన్‌లో మాత్రమే. 2009 వరకు చిత్తూరు అర్బన్, చిత్తూరు రూరల్ డివిజన్లు కలిసి ఉండేవి. రూరల్ డివిజన్ వేరుపడిన తరువాత అక్కడ ప్రస్తుతం చిత్తూరు, పైపల్లెలో ఈఆర్వోలు ఉన్నాయి. పుంగనూరు డివిజన్‌లో పలమనేరు, పుంగనూరు, సదుంలో, పుత్తూరు డివిజన్‌లో కార్వేటినగరం, నగరి, పుత్తూరు, నాగలాపురం ప్రాంతాల్లో రెవెన్యూ కార్యాలయాలు ఉన్నాయి. అదనంగా లేనిది చిత్తూరు అర్బన్ డివిజన్‌లో మాత్రమే. సాధారణంగా ప్రతి ఒక సబ్‌డివిజన్‌కు ఈఆర్వో కార్యాలయం ఉండాలి. కానీ చిత్తూరులో ఏళ్ల తరబడి శిథిలావస్థకు స్థితికి చేరిన కార్యాలయం ఒక్కటి ఉంది.

అర్బన్ డివిజన్ విద్యుత్ సమాచారం		
గృహసర్వీసులు	-	1,24,979
వ్యవసాయం	-	30,281
వాణిజ్య సర్వీసులు	-	16,464
పరిశ్రమలు	-	1664
నీటిసరఫరా	-	4836
వీధిదీపాలు	-	28,621
మొత్తం	-	2,06,845

ఉపయోగాలు ఇవీ..

చిత్తూరు అర్బన్ డివిజన్‌లో మొత్తం 12 సెక్షన్లు ఉన్నాయి. నగర సబ్‌డివిజన్ పరంగా సంతపేట, గిరింపేట, కొంగారెడ్డిపల్లె, మిట్టూరు, అలాగే రూరల్–2 సబ్‌డివిజన్ పరంగా పూతలపట్టు, జీడీనెల్లూరు, ఆవులకొండ, పెనుమూరు, పాలసముద్రం, అలాగే రూరల్–3 కింద గుడిపాల, రెడ్డిగుంట, చిత్తూరు రూరల్స్ సెక్షన్లు వస్తాయి. సాధారణంగా సంబంధిత సెక్షన్ల విద్యుత్ బిల్లు స్థానికంగానే చెల్లించాలి. కానీ ఈఆర్వో కార్యాలయంలో డివిజన్ పరిధిలోని 12 సెక్షన్ల బిల్లు కట్టే అవకాశం ఉంది. వీటితో పాటు అదనపులోడ్ రుసుం, జరిమానా, అపరాధరుసుం, బిల్లింగ్ సమస్య, మీటర్ పేరు మార్పు తదితర సేవలు ఇక్కడ అందుతాయి. 20 కిలోమీటర్ల దూరంలో ఉండే పూతలపట్టు వినియోగదారుడు సేవల కోసం ఇక్కడికి పలుమార్లు తిరగాల్సిన పరిస్థితి. అలా కాకుండా అదనంగా మరో రెండు కార్యాలయాలు ఏర్పాటు చేస్తే ఉపయోగం ఉంటుంది.

ప్రతిపాదనకే పరిమితం..

జీడీనెల్లూరు, పూతలపట్టు సెక్షన్లలో ఈఆర్వో పెట్టాలని ప్రతిపాదనలు ఉన్నాయి. అక్కడ ఏర్పాటు చేస్తే సబ్‌డివిజన్ వినియోగదారులు చిత్తూరుకు రాకుండా స్థానికంగా సేవలు పొందవచ్చు. దీంతో సమయం, ప్రయాణభారం తగ్గుతుంది. అవేకాకుండా చిత్తూరులో ఈఆర్వో నిర్మాణానికి ప్రతిపాదనలు పెట్టారు. స్థానిక డివిజన్ కార్యాలయంలో నూతన కార్యాలయం ఏర్పాటుకు పరిశీలన చేశారు.

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడులు



బంగారుపాళెం:తిమ్మోజుపల్లెలో వేరుశనగ పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

బంగారుపాళెం: రైతులు తమ భూముల్లో భూసార పరీక్షలు చేయించుకుని, ఆ ఫలితాల ఆధారంగా మందులు వాడాలని తిరుపతి వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త నాగమణి సూచించారు. బుధవారం మండలంలోని బొమ్మాయిపల్లె, తిమ్మోజుపల్లె పంచాయతీలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు పంటల సాగులో రసాయన ఎరువులను వినియోగించడం వల్ల నష్టాలు వస్తాయని, మేలైన పంట దిగుబడి సాధించేందుకు సేంద్రియ ఎరువులను వాడాలని సూచించారు. మామిడి, వరి, వేరుశనగ పంటలను ఆశించే చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, కలుపు మందుల వినియోగం గురించి రైతులకు వివరించారు. ప్రకృతి వ్యవసాయం సాగులో వినియోగించే ఘనజీవామృతం, ద్రవజీవామృతాన్ని తయారు చేసుకునే పద్ధతిని రైతులకు ప్రయోగాత్మకంగా చేసి చూపించారు. వ్యవసాయాధికారులు చిట్టిబాబు, పద్మజ వ్యవసాయశాఖ ద్వారా అమలు చేస్తున్న వివిధ పథకాల గురించి రైతులకు తెలియజేశారు. అనంతరం క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఈఓ సాదరయ్య, రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలతో రైతులకు మేలు



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ వరలక్ష్మి

ఐరాల: భూసార పరీక్షలు ఆధారంగా ఎరువులు వాడితే ఖర్చు తగ్గి నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చని ఏఓ వరలక్ష్మి అన్నారు. బుధవారం మండలంలోని పుల్లూరు, ఎగువ చవటపల్లె గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతులు ముఖ్యంగా భూసార పరీక్షలు చేయించుకోవాలన్నారు. దానికి అనుగుణంగా ఎరువులు, దాంతో పాటు మందులను వాడుకుంటే ఖర్చు తగ్గి రైతులకు నాణ్యమైన దిగుబడులు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. రైతులు సాగు సమయంలో సరైన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఏ పంటకు ఏ మందులు వాడాలో అవగాహన పెంచుకోవాలన్నారు. వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు, సలహాలు తప్పక పాటించాలన్నారు. ఈ–క్రాప్ నమోదు ఉంటేనే ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్ పరిహారం అందుతాయన్నారు. కార్యక్రమంలో వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం





వెంగంపల్లెలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ వినయ్‌కుమార్, కొండరాజుకాలువలో..

తవణంపల్లె: గర్భిణులు మంచి పౌష్టికాహారం తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని వైద్యాధికారులు వినయ్‌కుమార్, కేశవ నారాయణ తెలిపారు. బుధవారం మండలంలోని వెంగంపల్లె, కొండరాజుకాలువ గ్రామాల్లో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని సూచించారు. గర్భిణులు రక్తహీనత రాకుండా ఐరన్ మాత్రలు వాడాలని వివరించారు. ఆస్పత్రుల్లో ప్రసవం వల్ల తల్లీబిడ్డ క్షేమంగా ఉంటారని తెలిపారు. స్థానిక పీహెచ్‌సీలో సుఖప్రసవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రమాదకరమైన మలేరియా, ఫైలేరియా, డెంగీ వంటి వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ రాజశేఖర్, హెల్త్ అసిస్టెంట్ సుబ్రమణ్యం రెడ్డి, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అపరిచిత వ్యక్తులతో జాగ్రత్త



బంగారుపాళెం: కొదలమడుగు ప్రజలతో మాట్లాడుతున్న సీఐ శ్రీనివాసులు

బంగారుపాళెం: గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలు సాగించే వ్యక్తుల సమాచారం అందించాలని సీఐ శ్రీనివాసులు అన్నారు. బుధవారం మండలంలోని కొదలమడుగు, బండ్లదొడ్డి, టేకుమంద, జయంతి గ్రామస్తులతో సీఐ మాట్లాడారు. అపరిచితుల పట్ల జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. గ్రామాల్లో అనుమానితులపై పోలీసులకు సమాచారం అందించాలని, ప్రస్తుత సమాజంలో ప్రజలను వివిధ రకాలుగా మోసగించే వ్యక్తులు ఉన్నారని, అలాంటి వారి పట్ల జాగ్రత్త వహించాలన్నారు. ఆన్‌లైన్ మోసాలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. మారుమూల గ్రామాల్లో బాల్యవివాహాలు జరుగుతున్నాయని, చట్టరీత్యా నేరమని తెలిపారు. ఎవరైనా బాల్య వివాహాలు చేస్తే, వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామాల్లో గొడవలు లేకుండా ప్రజలు ప్రశాంతంగా జీవించాలని, అసాంఘిక కార్యకలాపాలపై 112కు సమాచారం అందించాలని కోరారు.

అవులా.. దేవు అయిలా..!



షికారీలకు నమస్కరిస్తున్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

చౌడేపల్లి: అవులా..అవులా...దేవు అయిలా..(రండి..రండి..మన స్వామి వచ్చారు..) జగన్‌కు జైబోలో..అంటూ షికారీ మహిళల ఆనందోత్సాహాలకు అంతులేకుండా పోయింది. బుధవారం ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబ సమేతంగా బోయకొండ గంగమ్మకు పట్టువస్త్రాలు సమర్పించడానికి వస్తున్నారని తెలుసుకున్న షికారీ మహిళలు షికారిపాళ్యం క్రాస్ వద్దకు వచ్చారు. వారిని చూసి పెద్దిరెడ్డి కారు దిగి ఆప్యాయంగా పలకరించారు. దిగువపల్లె సర్పంచ్ సోని, షికారీలతో ముచ్చటించారు. పలువురు ఆయనతో సెల్ఫీల కోసం ఉత్సాహం చూపారు. చౌడేపల్లె నుంచి బోయకొండ వరకు ప్రతి స్టేజిలోనూ మహిళలు, పార్టీనేతలు పెద్దిరెడ్డికి ఘనస్వాగతం పలికారు. వారి యోగక్షేమాలు తెలుసుకుంటూ ఆయన బోయకొండకు వెళ్లారు.

నిత్య స్వరూపిణి.. మహిషాసుర మర్దిని











చిత్తూరు: మహిషాసురమర్దిని అలంకరణలో అమ్మవారు, కంచి కామాక్షిగా, గుడిపాల: మహిషాసురమర్దిని అలంకరణ, బాలాత్రిపురసుందరీదేవిగా పల్లూరు గంగమ్మ | కె.పట్నం: ప్రత్యేక అలంకరణలో సత్యమ్మ











ఐరాల: వారాహిదేవిగా పాలేటమ్మ, సరస్వతీదేవిగా చాముండేశ్వరి | బంగారుపాళెం: శ్రీసర్వతిదేవిగా ముత్యాలమ్మ, వజ్రాలపురంలో.. | తవణంపల్లెలో ఓంశక్తి అమ్మవారు

- సరస్వతీ అలంకరణలో దర్శనమిచ్చిన అమ్మవారు
- ఆలయాలకు పోటెత్తుతున్న మహిళలు



పూజలు చేస్తున్న భక్తులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలోని గిరింపేటలో వెలసిన శ్రీదుర్గాంబ దేవస్థానంలో బుధవారం నవరాత్రి బ్రహ్మోత్సవాలు కనుల పండువగా జరుగుతున్నాయి. ఉదయం అభిషేకం చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. రాత్రి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని విశేషంగా అలంకరించారు. ప్రత్యేక మండపంలో మహిషాసురమర్దినిగా అమ్మవారు భక్తులను కటాక్షించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పూజలు చేశారు. గుర్రప్పనాయుడువీధిలో వెలసిన శ్రీఅంకాళపరమేశ్వరి ఆలయంలో ఉదయం పుష్పాలంకరణ చేపట్టగా, రాత్రి కంచికామాక్షి అలంకరణలో అమ్మవారు అభయమిచ్చారు. అలాగే కోదండరామస్వామి ఆలయంలో పరశురామావతరం, షిరిడీసాయిబాబా ఆలయంలో సరస్వతీదేవిగా భక్తులను కనువిందు చేశారు.

ఐరాలలో..

ఐరాల: స్థానిక గ్రామ దేవత పాలేటమ్మ ఆలయంలో అమ్మవారు వారాహిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. అలాగే వైఎస్ గేటులోని చాముండేశ్వరి అమ్మవారు సరస్వతీదేవిగా భక్తులను అనుగ్రహించారు. భక్తులకు పసుపు, కుంకుమ, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఉభయదారులుగా యల్లంపల్లె గ్రామస్తులు వ్యవహరించారు.

గంగమ్మకు విశేష పూజలు

వెదురుకుప్పం: మండలంలోని పచ్చికాపల్లం పంచాయతీ దాసరి కాలనీలో ఉన్న తిరుపతి గంగమ్మ ఆలయంలో బుధవారం విశేష పూజలు నిర్వహించారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. రాత్రి అన్నదానం చేశారు. ఉభయదారులుగా దాసరికాలనీకి చెందిన పి.సుజాత, దేవరాజు కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఇందులో భగంగా ఆలయాన్ని విద్యుత్‌దీపాలతో శోభయమానంగా తీర్చిదిద్దారు.

తవణంపల్లెలో..

తవణంపల్లె: మండలవ్యాప్తంగా అమ్మవారి ఆలయాల్లో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మండలంలోని కె.పట్నంలో సత్యమ్మ అమ్మవారికి విశేష పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. తవణంపల్లెలోని ఓంశక్తి ఆలయంలో, జొన్నగురకలలో విరుపాక్షమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి.

గుడిపాలలో..

గుడిపాల: మండలంలోని శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కందగిరి కొండవద్ద ఉన్న శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆలయంలో ఉన్న మూలస్థాన దుర్గమ్మ అమ్మవారు బుధవారం మహిషాసురమర్దినిగా భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే ఉదయం 9 గంటలకు అమ్మవారికి ప్రత్యేకంగా అభిషేకాలు, పూజలు నిర్వహించారు. పల్లూరు గంగమ్మ అమ్మవారు బాలాత్రిపురసుందరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

సరస్వతీ నమోస్తుతే..

బంగారుపాళెం: దసరా ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఏడో రోజు బంగారుపాళెం గ్రామ దేవత ముత్యాలమ్మ శ్రీసరస్వతీదేవి భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఉదయం అమ్మవారికి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకుడు మురళీస్వామి అమ్మవారి ఉత్సవ మూర్తిని సర్వతిదేవిగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించిన తరువాత భక్తులకు దర్శనం కల్పించారు. మండల కరుణీగర్ సంక్షేమ సంఘం వారు ఉభయదారులుగా వ్యవహరించారు.

వజ్రాలపురంలో..

మండలంలోని వజ్రాలపురం బోయకొండ గంగమ్మ శ్రీసరస్వతీదేవిగా భక్తులకు అభయమిచ్చారు. ఈ సందర్భంగా ఉదయం అమ్మవారిని శ్రీసరస్వతీదేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు. తగ్గువారిపల్లెకు చెందిన వరలక్ష్మి, శ్రీనివాస శర్మ ఉభయదారులుగా వ్యవహరించారు. ఆలయ ధర్మకర్తలు రాధమ్మ, కృష్ణప్ప, మేనేజరు మొగిలప్ప, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌కో ఎస్ఈగా ఇస్మాయిల్ అహ్మద్

చిత్తూరు కార్పొరేషన్: చిత్తూరు జిల్లా ట్రాన్స్‌కో ఎస్ఈగా ఇస్మాయిల్ అహ్మద్‌ను నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు కార్పొరేట్ కార్యాలయ వాణిజ్య విభాగం జీఎంగా ఉన్న ఆయన బదిలీపై ఎస్ఈగా రానున్నారు. ట్రాన్స్‌కో ఉమ్మడి జిల్లా పాలన తిరుపతి కేంద్రంగా జరుగుతోంది. ఇటీవల చిత్తూరు జిల్లాకు ఎస్ఈ కార్యాలయం కేటాయించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఎస్ఈను నియమిస్తూ ఆదేశాలు వచ్చాయి.

పొలంలో పంట మార్పిడి చేపట్టాలి



ఎగువ మారేడుపల్లెలో రైతులకు పంటల సాగుపై సూచనలిస్తున్న ఏఓ ప్రవీణ్

తవణంపల్లె: రైతులు పొలంలో పంట మార్పిడి చేపడితే మంచి దిగుబడి వస్తుందని ఏఓ ప్రవీణ్ తెలిపారు. బుధవారం మండలంలోని ఎగువ మారేడుపల్లె, ఉత్తరబ్రాహ్మణపల్లెలో వ్యవసాయ అనుబంధ శాఖల ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ రైతులకు నూతన వ్యవసాయ పద్ధతుల గురించి వివరించారు. పొలంలో ఒకసారి సాగు చేసిన తర్వాత మరోసారి వేరొక పంటను సాగు చేస్తే మంచి దిగుబడి వస్తుందని సూచించారు. రసాయన ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువులను వాడాలన్నారు. రైతులు వ్యవసాయ ఖర్చులు తగ్గించుకుని లాభసాటిగా చేపట్టాలన్నారు. మేలైన విత్తనాలను ఎంపిక చేసుకుని విత్తనశుద్ధి చేయాలని వివరించారు. విచ్చలవిడిగా ఎరువులు, మందులు వినియోగించరాదన్నారు. రైతుసేవాకేంద్రాల సిబ్బంది సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ఉత్తర బ్రాహ్మణపల్లెలో క్షేత్రస్థాయిలో వరి పంటను పరిశీలించి రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో వెటర్నరీ డాక్టర్ లావణ్య, మార్కెట్ శాఖ సిబ్బంది రామ్మూర్తి, పట్టు పరిశ్రమశాఖ సిబ్బంది ఆర్ముగం, రైతు సేవాకేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.